


www.manavaarthamirror.com

మన వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సంపుటి 02 — సంచిక 121 — రంగారెడ్డి — శనివారం 26 సెప్టెంబర్ 2026 — ఎడిటర్ :శ్రీధర్‌యాదవ్ — పేజీలు :8 — వెల:4/రూ

## 22ఏ భూముల వ్యవహారంపై

# కొత్త కమిటీ

**● పలు జిల్లాల్లో భూ అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై విచారణకు ప్రభుత్వం నిర్ణయం**




తెలంగాణలో 22ఏ భూముల వ్యవహారంతో పాటు పలు జిల్లాల్లోని భూములకు సంబంధించిన అక్రమాలు, నిబం ధనల ఉల్లంఘనలపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 16న శాసనసభలో 22ఏ భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ అనంతరం మరింత లోతైన పరిపాలనా విచారణ అవసరమని ప్రభుత్వం నిర్ణయించింది. కమిటీకి కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్ ఎ. శ్రీదేవసేన అధ్యక్షురాలిగా వ్యవహరించనున్నారు. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ సభ్యులుగా ఉంటారు. సంబంధిత జిల్లాలకు మిగతా2లో...



## నెల రోజుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతా తనిఖీలు

**- మంత్రి దామోదర కీలక ఆదేశాలు**

కూడా ఫైర్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ మెయింటనెన్స్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించేలా, అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను పటిష్టంగా అమలు చేసేలా సమగ్ర గైడ్‌లైన్స్ రూపొందించాలని అధికారులను రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రోగులు, సిబ్బందిని సురక్షితంగా తరలించేలా వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో నెల రోజుల్లో ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ సేఫ్టీల ఆడిట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆస్పత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ సేఫ్టీలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇక నుంచి ఫైర్, ఎలక్ట్రికల్ సేఫ్టీలపై ప్రతి ఆరు నెలలకోసారి, భవనాల నిర్మాణ పటిష్టతపై

మిగతా2లో...

# వెల్‌కమ్...కామ్రేడ్

**● జిన్‌పింగ్‌కు రెడ్‌కార్పెట్ స్వాగతం ● స్వయంగా ఆహ్వానించిన ట్రంప్**



వాణిజ్యం, సాంకేతికత, తైవాన్, ఇరాన్ వంటి అంశాలపై రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికాలో చైనా అధినేత జిన్‌పింగ్ పర్యటన ప్రారంభమైంది. అగ్ర రాజ్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు పరీక్ష పెట్టే మూడు రోజుల పర్యటన కోసం వాషింగ్టన్ చేరుకున్న జిన్‌పింగ్‌కు మిగతా2లో...

## దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

**- హైకోర్టు తీర్పులో జోక్యానికి నిరాకరణ.. పిటిషన్ కొట్టివేత**



అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించినట్లు పేర్కొంటున్నా రు. ఒక రాజకీయ పార్టీ నుంచి ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబం ధించిన అనంతరం మరో పార్టీ మిగతా2లో...




## జ్ఞానేష్ కుమార్ దేశద్రోహి రాజీనామా చేయాలి

**- ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ**

దేశ వ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ ప్రక్రియపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే సర్ సర్వే పై కేంద్ర ఎన్నికల కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తాయని జాతీయ మీడియాల్లో కథనాలు వచ్చాయి. దీంతో ప్రధాన ఎన్నికల మిగతా2లో...

## నీటి సంపుల్లో పడి ఇద్దరు బాలుర మృతి

**- మహబూబ్‌నగర్ జిల్లాలో విషాదం**



మహబూబ్‌నగర్ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలురు నీటి సంపుల్లో పడి మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్రలో బీహార్‌కు చెందిన ఎనిమిదేళ్ల ఆర్యన్ నీటి సంపులో పడి మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం తిరుమలగిరికి చెందిన 13 ఏళ్ల హనుమంతు కొండారెడ్డిపల్లి మిగతా2లో...

# జూరాలకు కృష్ణా జలాలు



సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గురువారం వనపర్తి కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులతో కృష్ణా జలాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగు, తాగునీటి అవసరాల కోసం సుమారు 18.19 టీఎంసీల నీరు అవసరమవుతుందని తెలిపారు. ప్రస్తుతం జూరాలలో ఉన్న సుమారు 7 టీఎంసీల నీటితో పాటు కర్ణాటక నుంచి వచ్చే నీరు, ఇతర వరద

పాలమూరు జిల్లాలో వానాకాలం పంటలను కాపాడటంతో పాటు తాగునీటి అవసరాలు తీర్చేందుకు కృష్ణా జలాలను జూరాల ప్రాజెక్టుకు విడుదల చేయించినట్లు రాష్ట్ర అబ్కారీ, పర్యాటక,

మిగతా2లో...

## ఆయిల్‌పామ్ రైతులకు దెబ్బ

**- సుంకం తగ్గింపుపై మంత్రి తుమ్మల ఆగ్రహం**



ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను దెబ్బ తీసేలా కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతులపై సుంకాన్ని తగ్గించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల గురువారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వైపు రైతులను ఆయిల్ పామ్

మిగతా2లో...

## 48 గంటల్లోగా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

**- కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే**





## నాపై కాంగ్రెస్ నేతల తప్పుడు

# ప్రచారం

**● దానంపై సుప్రీం తీర్పు.. రేవంత్‌కు చెంపపెట్టు : హరీశ్‌రావు ● పరువు నష్టం**

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వాళ్లు బురదలో ఉండి.. ఆ బురదను తమకు అంటించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాలు ప్రచారం చేస్తే భవిష్యత్తులో ఎవరినీ వదిలిపెట్ట బోమని హెచ్చరించారు. తాను క్షుద్రపూజలు చేయిస్తున్నానని ఆరోపించిన కాంగ్రెస్ నేతలపై పరువునష్టం దావా వేసిన హరీశ్‌రావు.. ఈ కేసు విచారణకు గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు

# 48 గంటల్లోగా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను చేయాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ భారతదేశ ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించారని డిప్కే ఆరోపించారు. ఆయన ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి, ఎవరు ఓటు వేయాలి , ఎవరు వేయకూడదు అనే విషయాన్ని ప్రభుత్వమే నిర్ణయిస్తోందని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించబడ్డాయి. ఇది చిన్న సంఖ్య కాదు, ఈ తొలగింపు మొత్తం ఓట్లలో సుమారు 13-14 శాతానికి సమానమని తెలిపారు. ఈ నేపథ్యంలో తాజా పత్రికా సమావేశంలో అభిజీత్ దీప్కే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై మండిపడ్డారు. ఈ ఉదంతాలు ప్రధాన ఎన్నికల కమిషనర్ దేశంలోనే అతిపెద్ద దేశద్రోహి అని నిరూపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాబోయే 48 గంటల్లోగా ఆయన రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త నిరసనలకు తెరతీస్తామని అల్టిమేటమ్ జారీ చేశారు.

# నాపై కాంగ్రెస్ నేతల తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 30న తన స్టేట్‌మెంట్‌ను నమోదు చేస్తామని కోర్టు చెప్పిందన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను కాపాడాలని స్పీకర్ ప్రయత్నించారని, కానీ.. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు ఆ ఎమ్మెల్యేలకు గుణపాఠంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాతైనా వారికి కనువిప్పు కలగాలన్నారు. రాజ్యాంగ సంరక్షకుడిగా వ్యవహరిస్తానన్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇప్పుడేమి చేస్తున్నారని ప్రశ్నించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలతో ఆయన రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన ఆరు గ్యారంటీల అమలు ఏమైందని హరీశ్‌రావు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా ఇప్పటివరకు డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదని, సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చినా స్పీకర్ పట్టించుకోవడం లేదని తెలిపారు. కాంగ్రెస్ నేతలు మాటలతో కాలం గడుపుతున్నారని, రాష్ట్రం తిరోగమ నం దిశలో పయనిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో పేరు చెప్పి చేతులు దులుపుకొంటున్నారని, ప్రతిపక్షం గా ప్రభుత్వాన్ని నిలదీస్తే సహించలేక పోతున్నారని అన్నారు.

# నెల రోజుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతా తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదికోసారి ఆడిట్‌లు నిర్వహించాలనీ, ఆడిట్‌లో గుర్తించిన లోపాలను నివేదికలకే పరిమితం చేయకుండా నిర్దిష్ట టైమ్‌బాండ్‌తో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. **సమగ్ర గైడ్‌లైన్స్, చెక్‌లిస్ట్‌తో జీవో** ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీకి సంబంధించి అన్ని అంశాలను కవర్ చేసేలా సమగ్ర గైడ్‌లైన్స్, స్టాండర్డ్ చెక్‌లిస్ట్‌తో ప్రత్యేక జీవో జారీకి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఫైర్ అలారం, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్, హైడ్రెంట్స్, స్ప్రింక్లర్ సిస్టమ్, ఫైర్ వాటర్ లైన్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్స్, ఎమర్జెన్సీ లైటింగ్, ఎలక్ట్రికల్ ప్యానెల్స్, వైరింగ్, డీజీ సెట్లు, ఏసీ యూనిట్లు, ఆక్సిజన్ సప్లై వ్యవస్థలు తదితర అంశాలతో పాటు ఎమర్జెన్సీ రెస్పాన్స్, ఎవాక్యుయేషన్ ప్రోటోకాల్స్‌ను కూడా చెక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. ప్రతి ఆస్పత్రిని కూడా సెన్సిటివ్, నాన్-సెన్సిటివ్ జోన్లుగా విభజించాలనీ, సెన్సిటీవ్ జోన్లలో ప్రత్యేక భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి సిబ్బందికి క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించి శిక్షణ ఇవ్వాలని సూచించారు.

# 22ఏ భూముల వ్యవహారంపై కొత్త కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన అంశాలను పరిశీలించే సమయంలో ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా కమిటీలో భాగస్వాములుగా వ్యవహరించనున్నారు. **పలు అంశాలపై సమగ్ర విచారణ** కమిటీ కేవలం 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ భూములు, మిగులు భూములు, అసైన్డ్ భూములు, జాగీర్, భూదాన్, ఇనాం, అటవీ భూములు, భూసేకరణ, పునరావాసం, నీటి వనరులు, వాటి పరీవాహక ప్రాంతాలు, భూ రికార్డులకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించనుంది. చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారిక ఆదేశాల ఉల్లంఘనలు జరిగాయా అనే అంశాన్ని పరిశీలించి బాధ్యతను నిర్ధారించడంతో పాటు అవసరమైన చర్యలను ప్రభుత్వానికి సిఫారసు చేయనుంది. విచారణకు అవసరమైన పత్రాలు, రికార్డులు, సమాచారాన్ని ఏ ప్రభుత్వ శాఖ నుంచైనా, జిల్లా కలెక్టర్ల నుంచి, స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఆధీనంలోని ఇతర సంస్థల నుంచి కోరే అధికారం కమిటీకి ప్రభుత్వం కల్పించింది. అవసరాన్ని బట్టి నిర్దిష్ట అంశాలపై మధ్యంతర నివేదికలను కూడా సమర్పించవచ్చు. తుది నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి అందించాలని ఆదేశించింది. **పలు జిల్లాల్లోని భూములపై దృష్టి** ప్రభుత్వ ఉత్తర్వుల్లో వివిధ జిల్లాల్లోని పలు భూ వ్యవహారాలను పరిశీలనకు చేర్చినట్లు నివేదికలు వెల్లడించాయి. సిద్దిపేట, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర జిల్లాల్లోని భూములకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నట్లు సమాచారం. ఇందులో మాజీ ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, అనుబంధ వ్యక్తులు లేదా సంస్థలకు సంబంధించిన భూములపై వచ్చిన ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇవి విచారణలో పరిశీలించాల్సిన ఆరోపణలు మాత్రమేనని, కమిటీ తుది నిర్ధారణ చేయాల్సి ఉంది. **గతంలో మరో కమిటీ ఏర్పాటు** ఇదిలా ఉండగా, 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సెప్టెంబర్ 18న మరో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీకి భూపరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేశ్‌కుమార్ అధ్యక్షుడిగా, న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖ ఉన్నతాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు సభ్యులుగా నియమితులయ్యారు. 22ఏకు సంబంధిం చిన 12 రకాల సమస్యలను పరిశీలించి పరిష్కార మార్గాలను సూచించడం ఆ కమిటీ ప్రధాన ఉద్దేశం. తాజాగా ఏర్పాటు చేసిన కమిటీ మాత్రం 22ఏ అంశం తో పాటు పలు రకాల భూ అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలను పరిశీలించనుంది. దీంతో రాష్ట్రంలో భూములకు సంబంధించిన వివాదాలు, నిషేధిత జాబితా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూ రికార్డుల అంశాలపై ప్రభుత్వం విస్తృతంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# ఆయిల్‌పామ్ రైతులకు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

సాగు వైపు ప్రోత్సహిస్తూ.. మరో వైపు విదేశీ పామాయిల్ దిగుమతులకు అనుకూలంగా సుంకాన్ని తగ్గించడం ద్వంద్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు. క్రూడ్ పామాయిల్ పై మొత్తం దిగుమతి సుంకాన్ని 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించడం వల్ల విదేశీ పామాయిల్ కు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్‌పామ్ గెలల ధరలపై ఒత్తిడి పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని కోరుతున్న సమయంలో కేంద్రం సుంకాన్ని తగ్గించడం బాధ్యతారాహిత్యమైన నిర్ణయమన్నారు. ఆయిల్ పామ్ సాధారణ సీజనల్ పంట కాదని, రైతులు ఏళ్లపాటు పెట్టుబడులు పెట్టి సాగు చేసే దీర్ఘకాలిక పంట అని తుమ్మల తెలిపారు. మొక్కలు నాటిన వెంటనే ఆదాయం రాదని, నీరు,ఎరువులు,నిర్వహణపై నిరంతరం ఖర్చు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఇలాంటి పంటకు మార్కెట్, ధరల విషయంలో విధాన పరమైన స్థిరత్వం అవసరమన్నారు. దిగుమతి విధానాల్లో తరచూ మార్పులు చేస్తే రైతుల్లో నమ్మకం దెబ్బ తింటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకు పైగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని చెప్పారు. పెట్టుబడి రాయితీలు, మొక్కల విస్తరణ,డ్రిప్ ఇరిగేషన్, మౌలిక వసతులు, ప్రాసెసింగ్ యూనిట్లు, రిఫైనరీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కేంద్రం కూడా ఎన్‌ఎంఇఓఓపి పథకం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ ఉత్పత్తిని పెంచి, వంట నూనెల దిగుమతులపై ఆధార పడటాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఒక వైపు సాగు విస్తరణకు లక్ష్యాలు నిర్దేశిస్తూ, మరో వైపు దిగుమతులను ప్రోత్సహించే విధానాలు తీసుకోవడం వల్ల రైతుల్లో నమ్మకం దెబ్బ తింటుందని అన్నారు. తాజా ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర కల్పించాలన్నది రాష్ట్ర రైతుల దీర్ఘకాలిక డిమాండ్ అని తుమ్మల తెలిపారు.



# సింగరేణిలో రూ.1600 కోట్ల బొగ్గు కుంభకోణం

పడిపోయిందని, అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తీవ్ర స్థాయిలో మండిపడింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితర నేతలు గురువారం సింగరేణి సీఎండీకి వినతి పత్రం సమర్పించారు. గతంలో 70 మిలియన్ టన్నులున్న ఉత్పత్తి ఇప్పుడు 58కి పడిపోవడం, థర్మల్ ప్లాంట్ కు నాసిరకం బొగ్గు సరఫరా చేస్తూ పొరుగు రాష్ట్రాలకు మేలైన బొగ్గును అమ్ము కోవడం వల్లే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం తలెత్తిందని వారు ఆరోపించారు. సంస్థలో ఏకంగా రూ.1600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయం కావడంపై సీఏజీతో సమగ్ర విచారణ జరిపించాలని, రాష్ట్ర ప్లాంట్లకు తక్షణమే నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల పక్షాన న్యాయ పోరాటం చేస్తామని బిఆర్ఎస్ నేతలు హెచ్చరించారు.

## దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**సికింద్రాబాద్, వార్త మిర్రర్ సెప్టెంబర్ 25:** పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ సీతాఫల్‌మండి డివిజన్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించా రు.క ార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, కనకట్ల హరి, కందడి నాగేశ్వరరెడ్డి, భాస్కర్ గిరి, అంబాల రాజ ేశ్వర్‌రావు, క్రాంతి గిరి, డివిజన్ అధ్యక్షుడు అరవింద్ కుమార్, ముఠా గణేష్, ఆకుల సంపత్, కుమారస్వామి, అల్లాడి కరుణాకర్, అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గణేష్ గల్లీ అసోసియేషన్ లడ్డూ వేలం....



**మాదాపూర్ వార్త మిర్రర్ :** మాదాపూర్ పరిధిలో లో ని గుట్టల బేగంపేట్ లో శ్రీ గణేష్ గల్లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది.(ఎస్ డీ ఎన్ ఆర్)బ్రదర్స్ వారు రూ.35,000/- కు లడ్డూను సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ కమిటీ సభ్యులు లడ్డూ గ్రహీతలను ఘనంగా సన్మానించారు.

## 32 ఏళ్లుగా భారీ గణనాథుడి ప్రతిష్ఠ.. ఘనంగా నిమజ్జనం



**. గణనాదుడి సేవలో చంద్రబాబు నాయుడు నగర్ బస్తివాసులు**

సికింద్రాబాద్, వార్త మిర్రర్, సెప్టెంబర్ 25: తార్నాక డివిజన్ పరిధిలోని లాల ాపేట చంద్రబాబు నాయుడు నగర్ బస్తీలో 32 ఏళ్లుగా బీఆర్ఎస్ సీనియర్ నాయ ుకుడు కోళ్ల వెంకటేష్ యాదవ్ తన సొంత ఖరు ్చలతో భారీ గణనా థుడిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ బస్తీ ప్రజలను ఏకం చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల అనంతరం శుక్రవారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువత, భక్తులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, డప్పుల మోతల నడుమ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం గణనాథుడిని ట్యాంక్‌బండ్‌కు తరలించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీకి చెందిన కోళ్ల హరి యాదవ్, విఘ్నేష్, ముక్కల రాముడు, గోకరి చందర్, రాజు, మల్లేష్, ప్రభాకర్, కేట్లయ్య, డి. చంద్రన్న, గోకరి తదితరులతో పాటు బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తార్నాకలో వినాయక మండపంలో ప్రత్యేక పూజలు





**సికింద్రాబాద్ వార్త మిర్రర్, సెప్టెంబర్ 25:** తార్నాక డివిజన్‌లోని మాణికేశ్వరి నగర్‌లో గండికోట విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శుక్రవారం సినీనటులు శివాజీరాజా, చంద్రకాంత్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు, భక్తులు సినీనటులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గిరిబాబు, చిరంజీవి, శంకర్, రాజేష్, నాగరాజు, నర్సింగ్, వెంకటేష్, ఇద్దయ్య, మల్లేష్, గోపి, రాజు, రామ్‌చరణ్, రవి, భరత్, గుణ, నితీష్, ధనుష్, జన, శివ, యశ్, బన్నీ, బిట్టు, భాషా, సాయి తదితరులు పాల్గొన్నారు

## వడ్డెర యూత్ అసోసియేషన్ లడ్డూ 1,37,000/-



**మాదాపూర్ వార్త మిర్రర్ :** మాదాపూర్ డివిజన్ గుట్టల బేగంపేట్ లో వడ్డెర బస్తి లో వడ్డెర యూత్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది. ఈ వేలంలో గణేష్ లడ్డూను మంజలా రంగయ్య, సా ంబయ్య వారి కుటుంబ సభ్యులు రూ. 1,37,000/-లి లకు లడ్డు ను దక్కించుకున్నారు. లడ్డూ, సొంతం చేసుకున్న వారిని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

# ఉపాధ్యాయునికి అరుదైన గౌరవం

**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 25** సెప్టెంబర్ 21–25 వరకు సింగపూర్ దేశంలో అమలు చేస్తున్న విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి వెళ్లిన విద్యాధికారులు, ఉపాధ్యాయ బృందం తమ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి తమ పరిశీలనలను ప్రభుత్వానికి నివేదిక ద్వారా సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు సింగపూర్ దేశంలోని వివిధ పాఠశాలలు, వృత్తి విద్యా కళాశాలలు సందర్శించి అక్కడి బోధనా అభ్యసన, మూల్యాంకన విధానాలను పరిశీలించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం నుండి హాజరైన 40 మంది బృందంలో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరి పల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కడకుంట్ల అభయ్ రాజ్ తమ




పరిశీలనలను సమర్పించి సింగపూర్ జాతీయ విద్యా శిక్షణా సంస్థ డైరెక్టర్, తెలంగాణ ఇంటర్ విద్యా సంచాలకులు అభిలాష అభినవ్, విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్ ల చేతుల మీదుగా ప్రశంసాపత్రంను అందుకున్నారు.

# గిరిజన గురుకులంను సందర్శించిన(ట్రైనీ) సబ్ కలెక్టర్ హరిణి



**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 25**జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని జగన్నాథ్ పూర్ గ్రామంలో గల గిరిజన గురుకుల వసతి గృహాన్ని జగిత్యాల సబ్ కలెక్టర్ కన్నం హరిణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నెలకొన్న సమస్యలను విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందివ్వాలని, అలాగే వసతి గృహంలో, చుట్టూ పరిసరాలలో పరిశుభ్రత పాటించాలని సంబంధిత అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు సృజనాత్మకమైన విద్యతో పాటు, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాత పెంపొందించే వివిధ రకాల కార్య క్రమాలను వివరిస్తూ, విద్యా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.

# దీన్‌దయాళ్ ఆశయాలే ఆదర్శం

**కల్వకుర్తి సెప్టెంబర్ 24 వార్త మిర్రర్ ప్రతినిధి:-** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన అంత్యోదయ సిద్ధాంతం నేటి సమాజానికి, ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తోందని బీజేపీ నాయకులు అన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని కల్వకుర్తి మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు సైతం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని తెలిపారు. ఏకాత్మ మానవతావాదం ద్వారా సమాజంలోని ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారని పేర్కొన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ భారతీయ జనసంఘ్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారని తెలిపారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణానంతరం పార్టీ బాధ్యతలను భుజాన వేసుకుని జనసంఘ్ అభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. పాంచజన్య, స్వదేశ్ వంటి పత్రికలకు సంపాదకుడిగా పనిచేయడంతో పాటు పలు గ్రంథాలు, రచనలు చేశారని తెలిపారు. సమాజంలోని ప్రతి వ్యక్తి శరీరం, మనస్సు, బుద్ధి, ఆత్మ సమన్వయంతో




సంపూర్ణంగా అభివృద్ధి చెందాలనే భావనతో ఏకాత్మ మానవతావాదాన్ని ప్రతిపాదించారని నాయకులు వివరించారు. గ్రామీణాభివృద్ధి, స్వావలంబన, వికేంద్రీకరణకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. భారతదేశం స్వతంత్రంగా, స్వావలంబనతో అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారని పేర్కొన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ముఖ్యంగా సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకున్న అంత్యోదయ భావన ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతను చాటుతుందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో ఘనంగా చాకలి ఐలమ్మ 131వ వర్ధంతి వేడుకలు

### వైస్ చైర్మన్‌గా కొన్నే సంపత్ నియామకం



**సికింద్రాబాద్, వార్త మిర్రర్ సెప్టెంబర్ 25:** వీరవనిత చాకలి ఐలమ్మ 131వ వర్ధంతి వేడుకలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి వైస్ చైర్మన్‌గా కొన్నే సంపత్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తనను వైస్ చైర్మన్‌గా నియమించినందుకు ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భం గా కొన్నే సంపత్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ధైర్యం, ఆత్మగౌరవం సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని రజక సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## తార్నాకలో ఘనంగా గణనాథుడికి మహారతి



**సికింద్రాబాద్, వార్త మిర్రర్, సెప్టెంబర్ 25**: తార్నాక హనుమాన్‌నగర్‌లో గణనాథుడికి మహారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 27 ఏళ్లుగా వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన మహారతి కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డితో పాటు పలువురు మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన దాండియా కార్యక్రమం సందడిగా సాగింది. దాండియా పాటలకు మహిళలు ఉత్సాహంగా స్టెప్పులేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అరోరా యూత్ అసోసియేషన్ గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**కాప్రా, వార్త మిర్రర్, సెప్టెంబర్ 25 :** అరోరా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 19 ఏళ్లుగా నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధ లతో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వాహకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలను భక్తులు, స్థానికుల కోసం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మంది స్థానికులు, భక్తులు ఈ శిబిరానికి హాజరై పలు వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు, సూచనలు పొందారు. 19 ఏళ్ల వేడుకలకు గుర్తుగా 19 రకా ల వంటకాలతో భక్తులకు అన్నదానం చేశారు .మహిళలకు ఉచితంగా ప్లేట్లు,బేసిన్లను పంపిణీ చేశారు. ఆదివారం గణేష్ నిమజ్జన ఊరేగింపు కు ఏర్పాట్లు పూర్తవుతున్నాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. నవరాత్రి వేడుకలు, సేవా కార్యక్రమాలు ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోగికర్ శివకుమార్ నాయకత్వంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, మాదాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ లడ్డూ వేలం

### రూ.2,11,000/-లి కు లడ్డూ ను కైవసం చేసుకున్న పహల్వాన్ శ్రీనివాస్, సంజయ్ కుమార్...



**మాదాపూర్ వార్త మిర్రర్ :** ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, మాదాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది. ఈ వేలంలో గణేష్ లడ్డూను పహల్వాన్ శ్రీనివాస్, సంజయ్ కుమార్ రూ.2,11, 000/-లి కు కైవసం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకున్న సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేస్తూ గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు లడ్డూ గ్రహీతలను ఘనంగా సన్మానించారు.

## కల్వకుర్తిలో ఘనంగా 'నమామి భారతం




**కల్వకుర్తి సెప్టెంబర్ 25 వార్త మిర్రర్ ప్రతినిధి:-** శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల, కల్వకుర్తిలో విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో "నమామి భారతం -- వందేమాతరం సామూహిక గానం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు ముఖ్య వక్తగా హాజరై, వందేమాతరం గీతం ప్రాశస్త్యాన్ని, దేశభక్తి, జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో దాని పాత్రను విద్యార్థులకు తెలిపారు. ముఖ్య అతిథిగా కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్పర్సన్ బృంగి రత్నమాల పాల్గొని, తాను కూడా శ్రీ సరస్వతి శిశు మందిర్ పూర్వ విద్యార్థినేనని, విద్యార్థులను ఉద్దేశించి వందేమాతరం గీతం విశిష్టతను తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షులు టి. లక్ష్మారెడ్డి, ప్రబంధకారిణి అధ్యక్షులు డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, పాఠశాల కార్యదర్శి సాదు మురళీధర్ రెడ్డి, పాలమూరు విభాగ్ శైక్షణిక ప్రముఖులు కృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి కసిరెడ్డి నర్సిరెడ్డి, ప్రధానాచార్యులు సేవకుల రాజుతో పాటు కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తాజ్ పూర్ పాఠశాలలో స్పోర్ట్స్ ఫర్ స్వచ్ఛత క్రీడల పోటీలు

### విద్యార్థులు క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి- సామాజికవేత్త డాక్టర్ రాకల శ్రీనివాస్

### క్రీడ విజేతలకు బహుమతులు అందించిన- సర్పంచ్ రాకల సంతోష- శ్రీనివాస్




**యాదాద్రి మన వార్త మిర్రర్ ప్రతినిధి**యాదాద్రి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో స్వచ్ఛత హీ సేవ– స్పోర్ట్స్ ఫర్ స్వచ్ఛత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో క్రీడలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను గ్రామ సర్పంచ్ రాకల సంతోష శ్రీనివాస్ అందజేశారు. సామాజికవేత్త డాక్టర్ రాకల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ముఖ్యంగా విద్యపై ఉన్న శ్రద్ధ స్వచ్ఛతపై కూడా ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

### ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలి- సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి



**యాదాద్రి మన వార్త మిర్రర్ ప్రతినిధి** నారాయణపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (హై స్కూల్) సెప్టెంబర్ 27 ఆదివారం రోజున కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని తెలిపారు సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 సంవత్సరాల వయసు పైబడిన వారికి ఉచితంగా కంటి పరీక్షలతో పాటు అవసరం ఉన్న వారికి ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## హైదరాబాద్ లో ఐఆర్ఈసీ 2026 సదస్సు ప్రారంభం




**మాదాపూర్ వార్త మిర్రర్** : హైటెక్స్ లో ఇంటర్నేషనల్ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్ (ఐ ఆర్ ఈ ఎ ) 2026 ఘనంగా ప్రారంభమైంది. భారత్ లో తొలిసారిగా జరుగుతున్న ఈ సదస్సు 27వ తేదీ వరకు జరగనుంది. 35 దేశాల నుంచి 2000 మంది ప్రతినిధులు, 75 మంది అంతర్జాతీయ వక్తలు హాజరయ్యారు. అమెరికా నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ (ఎన్ ఏ ఆర్ ) అధ్యక్షుడు కెవిన్ బ్రౌన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్ఏఆర్–ఇండియా హైదరాబాద్ రియల్టర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఏఐ , ప్రాప్‌టెక్, పెట్టుబడులు, సుస్థిర అభివృద్ధిపై చర్చలు జరగనున్నాయి.

# ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు అండగా మెగా జాబ్ మేళా

**- 50కి పైగా కంపెనీలతో భారీ ఉపాధి అవకాశాలు.**

**- ఫౌండేషన్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ బొల్ల శివశంకర్**



**వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి సెప్టెంబర్ 25** "యువత ప్రతిభకు అవకాశం... ప్రతి అడుగులో ఆసరా... ప్రతి విజయానికి ప్రోత్సాహం" అనే లక్ష్యంతో ఆసరా ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, వారి ప్రతిభను గుర్తించి సరైన రంగంలో ఉపాధి పొందేలా చేయడం లక్ష్యంగా ఆసరా ఫౌండేషన్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ బొల్ల శివశంకర్ ఆధ్వర్యంలో మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యువతకు కేవలం మాటల్లో ప్రోత్సాహం కాకుండా ఉద్యోగ అవకాశాలను వారి వద్దకే తీసుకురావాలనే సంకల్పంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు బొల్ల శివశంకర్ తెలిపారు. సెప్టెంబర్ 27వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చౌటుప్పల్ మండలం తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ జాబ్ మేళా జరగనుంది. ఈ జాబ్ మేళాలో 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ విభాగాల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. మ్యానుఫ్యాక్చరింగ్, బీపీఓ, ఐటీ, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, రిటైల్, సేల్స్, మార్కెటింగ్ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండనున్నాయి. వివిధ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేవే లక్ష్యం... యువతే భవిష్యత్తు బొల్ల శివశంకర్ ఆధ్వర్యంలో ఆసరా ఫౌండేషన్ గతంలోనూ ప్రజలకు, విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలను చేపట్టింది. సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవడంతో పాటు, యువతకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. "ఒక యువకుడికి ఉద్యోగం లభిస్తే ఒక కుటుంబానికి భరోసా వస్తుంది. ఒక కుటుంబం ఆర్థికంగా నిలబడితే సమాజం బలపడుతుంది" అనే ఆలోచనతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని బొల్ల శివశంకర్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం కోసం అనేక మంది యువత వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, అలాంటి వారికి స్థానికంగానే ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో నేరుగా మాట్లాడి ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఈ జాబ్ మేళా ద్వారా లభిస్తుందని తెలిపారు. యువతకు పిలుపు చౌటుప్పల్, మునుగోడు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొల్ల శివశంకర్ పిలుపునిచ్చారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ప్రతి యువకుడు, యువతి తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. యువతకు ఉద్యోగం... కుటుంబాలకు ఆర్థిక భరోసా సమాజానికి అభివృద్ధి అనే లక్ష్యంతో ఆసరా ఫౌండేషన్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని బొల్ల శివశంకర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా యువతకు మరిన్ని ఉద్యోగ, విద్యా, ఉపాధి అవకాశాలు అందించే కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు..

## ప్రగతిలో ఘనంగా గో విజ్ఞాన పరీక్షలు



**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 25**

జగిత్యాల జిల్లా రాయికల్ ప్రగతి హైస్కూల్ ఐఐటీ అకాడమీ లో విద్యార్థులకు గో విజ్ఞాన పరీక్షలను నిర్వహించారు. విద్యార్థుల్లో గోవుల పట్ల అవగాహన, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, గో సంరక్షణ ప్రాధాన్యతపై జ్ఞానాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ పరీక్షలను నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గో సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, దేశీయ పశు సంపద ప్రాధాన్యత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠ్యాంశాలతో పాటు ఇటువంటి విజ్ఞాన పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సాధారణ జ్ఞానం, ఆసక్తి, పోటీతత్వ స్ఫూర్తి పెంపొందుతుందని పాఠశాల ప్రతినిధులు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవసరమైన సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ గో సేవ ఖండ ప్రముఖ్ శ్రీ గద్దె సుమన్ పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి




**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 25**జగిత్యాల జిల్లాలోని, రాయికల్ పట్టణ కేంద్రం నందు శ్రీ చెన్నకేశవ నాథ ఆలయం (త్రికూటాలయం) లో తేది 27 సెప్టెంబర్ 2026న ఉదయం 10 గంటల నుండి ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక, యువజన, క్రీడల శాఖ అధ్వర్యంలో ఘనశీగా నిర్వహించుకోవడం జరుగుచున్నది. జగిత్యాల జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రదేశాలను ప్రజలకు మరింతగా పరిచయం చేయడం, పర్యాటక ప్రాధాన్యతను పెంపొందించడం, స్థానిక పర్యాటక రంగ అభివృద్ధికి ప్రోత్సాహం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యము. కావున జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా పతినిధులు, విద్యార్థిని విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు, పాత్రికేయ మిత్రులు పర్యాటక అభిమానులు, పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డా. కోరుకంటి రవి కుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## తార్నాకలో ఘనంగా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి



**సికింద్రాబాద్, వార్త మిర్రర్ సెప్టెంబర్ 25 :** పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని తార్నాక డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తార్నాక డివిజన్ అధ్యక్షుడు కంటే కరుణాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, పదాధికారులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొని దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహంకాళి జిల్లా ఇంటలెక్చువల్స్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్‌తో పాటు వీరన్న, అనుషా, సరోజా, రాగిశ్రీ శ్రీనివాస్, రాకేష్, దేవా, ఖేదరి, కృష్ణ గౌడ్, రాధాకృష్ణ, గౌరీ, శివ గౌడ్, నక్కనాగేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు తార్నాక డివిజన్ బీజేపీ నాయకత్వం కృతజ్ఞతలు తెలిపింది.

## వైద్య విద్యార్థినికి ఆర్థిక భరోసా

**- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి**



**కల్వకుర్తి, వెల్దండ సెప్టెంబర్ 25 వార్త మిర్రర్ ప్రతినిధి:-** పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో సీటు సాధించిన వెల్దండకు చెందిన విద్యార్థిని గుద్దేటి సరితకు ఐక్యత ఫౌండేషన్ అధ్యక్షు డు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. సరిత చిన్నతనంలోనే తండ్రిని కోల్పోగా, తల్లి దినసరి కూలీగా పనిచేస్తూ ఆమె చదువుకు అండగా నిలిచారు. వైద్య విద్యకు అయ్యే ఖర్చులను భరించడం కష్టంగా మారడంతో సరిత పరిస్థితిని తెలుసుకున్న రాఘవేందర్‌రెడ్డి స్పందించి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదని, సరిత వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. సరిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తుల అర్హత పరిశీలన

**ఇటిక్యాలలో దరఖాస్తులను పరిశీలించిన ఎంపీవో సుష్మ**



**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 25** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో చేయూత పథకం కింద వివిధ రకాల పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను అధికారులు పరిశీలించారు. ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, దివ్యాం గులు తదితర వర్గాలకు చెందిన దరఖాస్తుదారుల వివరాలను రాయికల్ మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) సుష్మ పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల వివరాలు, అర్హతలు, సంబంధిత పత్రాలను పరిశీలించి, నిబ ంధనల ప్రకారం అర్హులైన వారికి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని అధి కారులు తెలిపారు. అర్హత పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి తోట రాజేష్, నాయకులు మరిపల్లి శ్రీనివాస్ గౌడ్, జవ్వాజి నరస గౌడ్, కారోబార్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సంకల్పం, సేవే నాయకత్వానికి బలం... బిజెపి జిల్లా ఇంటలెక్చువల్ కన్వీనర్ డాక్టర్ శ్రీరామ్ వెంకట్

.

**..అనంత పద్మనాభ స్వామి సన్నిధిలో సేవా నిబద్ధతకు సంకల్పం..**



**సికింద్రాబాద్, వార్త మిర్రర్ సెప్టెంబర్ 25** : అనంత పద్మనాభ స్వామి వ్రతం సంకల్పం, నియమం, సహ నం, ధర్మం యొక్క విలువను గుర్తుచేస్తుందని బిజెపి జిల్లా ఇంటలెక్చువల్ కన్వీనర్ డాక్టర్ శ్రీరామ్ వెంకట్ పేర్కొన్నారు. పాండవుల 14 ఏళ్ల అరణ్యవాసాన్ని స్మరించుకుంటే.. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా లక్ష్యాన్ని వదలకుండా ముందుకు సాగిన వారి ప్రయాణం నేటి తరానికి గొప్ప సందేశాన్ని ఇస్తుందని ఆయన తెలిపా రు. ప్రజాజీవితంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుందని పేర్కొంటూ.. పదవి ఉన్నప్పుడు మాత్రమే ప్రజల మధ్య ఉండటం కాకుండా, పదవి లేకపోయినా ప్రజలతో మమేకమై సేవ చేయడమే నిజమైన నాయకత్వానికి పరీక్ష అని అన్నా రు. ప్రచారం కోసం సేవ చేయడం కాకుండా.. సేవే తమ పనికి పరిచయంగా నిలవాలని, ఒక్కరోజు కార్యక్రమాలతో కాకుండా సంవత్సరాల పాటు కొనసాగించే నిబద్ధతే నిజమైన బలమని పేర్కొన్నారు. నంత పద్మనాభ స్వామి సన్నిధిలో ప్రజల పట్ల బాధ్యత, సేవ పట్ల నిబద్ధత, ధర్మబ ద్ధమైన ప్రయాణాన్ని మరింత బలంగా కొనసాగించాలనే సంకల్పం చేసినట్లు డా. శ్రీరామ్ వెంకట్ తెలిపారు. "కాలం పరీక్షించవచ్చు.. పరిస్థితులు మార వచ్చు.. కానీ సంకల్పం బలంగా ఉంటే ప్రయాణం ఆగదు" అని పేర్కొన్నారు.

## వందేమాతర గీతం ని ప్రతి పౌరుడు గౌరవించాలి..



**వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి సెప్టెంబర్ 25** ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వందేమాతర గీతం రచించి 150 సంవత్సరములు పూర్తి అయిన సందర్భంగా ప్రతి పౌరుడు వందేమాతర జాతీయ గీతాన్ని భాగాలుగా కాకుండా పూర్తిగా నేర్చుకొని ఆలపించాలనే సదుద్దేశంతో చౌటుప్పల్ మండల కేంద్రంలోని త్రినిటీ విద్యాసంస్థలు ఈరోజు 25 /9 /2026 నుండి ప్రతి విద్యార్థులకు కంఠస్థపరచి మన దేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, వనరులను, సంస్కృతిని ప్రతిబింబించే ఈ గేయ అర్థాలను కులంకుశంగా అభ్యసించేటట్లు చేయాలనే దృఢ సంకల్పంతో మొదలుపెట్టి ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం పాఠశాల యందు వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జుని మంజుల, త్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీపీ కృష్ణారావు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీ,మోడల్ స్కూల్ వసతి గృహంలో వంటమనిషి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**-చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ గురువారావు**

**వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి సెప్టెంబర్ 25** చౌటుప్పల్ లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలకు అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహంలో సహాయ వంటమనిషి-1, వలిగొండ రోడ్డు లోని కేజీబీవీ పాఠశాల, కళాశాలకు సహాయ వంట మనిషి -1 పోస్టులకు 18-45 ఏళ్ల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ గురువారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వంటలు చేయడంలో అనుభవం కలిగి ఉన్న లోకల్ అభ్యర్థులు పూర్తిచేసిన తమ దరఖాస్తులను ఈనెల 30వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో అందజేయాలని ఎంఈఓ తెలిపారు. అభ్యర్థులు కనీసం ఏడవ తరగతి విద్యారత కలిగి ఉండాలని వారు తెలిపారు. ఎంఈఓ, ఎమ్మార్వో, ఎంపీడీవో త్రిసభ్య కమిటీ సభ్యులచే నియామక ప్రక్రియ చేయబడుతుందని ఆయన తెలిపారు.

## ఘనంగా శ్రీ గణేష్ గల్లీ అసోసియేషన్ లడ్డూ వేలం....



**మాదాపూర్ వార్త మిర్రర్** :మాదాపూర్ పరిధిలో లో ని గుట్టల బేగంపేట్ లో శ్రీ గణేష్ గల్లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది. గాయత్రీ డిజిటల్ ప్రింట్స్ వారు రూ.58,000/- కు లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ కమిటీ సభ్యులు లడ్డూ గ్రహీతలను ఘనంగా సన్మానించారు.